

నారు.. అమ్మకాల జోరు

ఏటా తొలకరి వచ్చిందంటే నారు వ్యాపారం జోరుగా సాగుతుంది. జూన్ నుంచి సుమారు నాలుగు నెలల పాటు ఈ వ్యాపారం ఉంటుంది. 8లో



1,538 కేసుల పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్అదాలత్‌లో 1,538 కేసులు పరిష్కరించినట్టు ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. 8లో



ప్రకృతి వ్యవసాయంతో భూసారం

ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యంతో పాటు భూసారం పెంచేందుకు ప్రకృతి వ్యవసాయమే మార్గమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో

ఆయిల్‌పామ్.. ధర పతనం

ఆయిల్‌పామ్ ధరలు తిరోగమనం బాట పట్టాయి. క్రూడ్ ఆయిల్‌పై కేంద్రం దిగుమతి సుంకం రద్దు చేయడం, ఇతర కారణాలతో ఆయిల్‌పామ్ ధరలు భారీగా పడిపోతున్నాయి. గతేడాదితో పోల్చితే 40 శాతం మేర ధరలు తగ్గాయి. అంతర్జాతీయంగా వచ్చే 30 ఏళ్ల వరకు ఆయిల్‌పామ్‌కు విపరీతంగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతుండగా దానికి విరుద్ధంగా ధరలు పతనమవుతున్నాయి. ఐదేళ్ల నుంచి వరుసగా ధరలు పెరుగుతూ రాగా ఈ ఏడాది మాత్రం తగ్గుముఖం పట్టాయి. ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

- గతేడాదితో పోల్చితే సగానికి పడిపోయిన టన్ను ధర
- 2022లో రూ.26 వేలు పలికిన ధర
- ప్రస్తుతం టన్ను ధర రూ.13,180
- దేశంలోనే ఏలూరు జిల్లా సాగులో మొదటి స్థానం
- ఏటా జిల్లాలో పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు
- రాష్ట్రవ్యాప్తంగా సాగులో 80 శాతం ఒక్క ఏలూరు జిల్లాలోనే..
- ధరలు తిరోగమనంలో ఉన్నా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వాణిజ్య పంటల్లో అగ్రగామిగా ఉన్న ఆయిల్‌పామ్ సాగు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అధికంగా ఉంది. దేశంలోనే సాగు విస్తీర్ణం, ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 1.62 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు జరుగుతుండగా ఒక్క ఏలూరు జిల్లాలోనే 48,968.8 హెక్టార్లలో, పశ్చిమగోదావరి జిల్లాలో 3 వేల హెక్టార్లు సాగులో ఉంది. సుమారుగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు కలిపి 1.30 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్, కోకో, కొబ్బరి, మిరియాలు, ఇతర సుగంధ ద్రవ్యాలు అంతర పంటగా వేసుకునే వీలు ఆయిల్‌పామ్‌కు ఉండటంతో లక్షా 30 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌తో పాటు అత్యధిక శాతం కోకో అంతర పంటగా ఉంది. ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతం కావడంతో గాలిలో 85 శాతం తేమ ఉండటంతో ఆయిల్‌పామ్ సాగుకు జిల్లా పూర్తి అనుకూలంగా ఉంది. ఇసుకతో కూడిన ఎర్రని నేలలు కావడం, కృష్ణా, గోదావరి డెల్టా మధ్య ప్రాంతం కావడంతో గాలిలో తేమ శాతం ఉండటం వాతావరణం పూర్తి అనుకూలంగా ఉండటంతో ఆయిల్‌పామ్ సాగు అత్యధికంగా సాగుతుంది. మార్కెట్ ధరలతో నిమిత్తం లేకుండా దీర్ఘకాలిక పంటగా దీనిని అధిక శాతం రైతులు సాగు చేస్తున్నారు.

తిరోగమనంలో ధరలు

ఆయిల్‌పామ్ ధరలు తిరోగమనంలో కొనసాగుతున్నాయి. 2017లో సగటున రూ.8 వేలు ఉన్న ధర అంతర్జాతీయ పరిణామాలు డిమాండ్ కారణంగా 2022 నాటికి టన్ను ధర అత్యధికంగా రూ.26 వేలకు చేరింది. ఆ తరువాత క్రూడ్ ఆయిల్‌పై దిగుమతి సుంకం రద్దు చేయడంతో ఆయిల్‌పామ్ ధర తిరోగమన బాట పట్టి గతేడాది రూ.23 వేలు సగటున ఉండగా ప్రస్తుతం రూ.13,180కు పరిమితమైంది. రెండేళ్ల క్రితం వరకు కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ ఇంపోర్ట్‌పై డ్యూటీ (దిగుమతి సుంకం) విధించింది. ఐదేళ్ల క్రితం వరకు ఇంపోర్ట్ డ్యూటీ 30 శాతం ఉండగా తర్వాత 20 శాతానికి తగ్గించారు. గతేడాది పూర్తిగా రద్దు చేయడంతో దేశంలోని ప్రధాన కంపెనీలు దిగుమతులపై ఆధారపడుతున్నాయి. వాస్తవానికి 10 లక్షల టన్నులు ఏటా డిమాండ్ ఉంటే 2 లక్షల టన్నులు కూడా ఉత్పత్తి లేని పరిస్థితి. ఈ క్రమంలో డిమాండ్ అధికంగా ఉండాలి. అయితే ఇంపోర్ట్ డ్యూటీ పూర్తిగా రద్దు చేయడంతో దిగుమతుల పైనే అత్యధికంగా ఆధారపడటంతో స్థానిక మార్కెట్‌లో ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఈ ఏడాది మళ్లీ ఇంపోర్టు డ్యూటీ విధించే అవకాశం ఉంది. ఇంపోర్ట్ డ్యూటీ అమలులోకి వస్తే ఆయిల్‌పామ్ ధరలు కొంతైనా పెరిగే అవకాశం ఉంది.



ఆయిల్‌పామ్ తోట



ఆయిల్‌పామ్ గెలలు

టన్ను ధర

సంవత్సరం	ధర రూ.	సంవత్సరం	ధర రూ.
2017	8,500	2021	17,951
2018	8,600	2022	26,000
2019	7,700	2023	23,000
2020	10,000	2024	13,180

ఏలూరు జిల్లాలో భారీగా సాగు

ఏలూరు జిల్లాలో 14 మండలాల్లో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతుంది. 2019–20లో 72,860 హెక్టార్లు, 2020–21లో 70,963 హెక్టార్లు, 2022023లో 48,836 హెక్టార్లు, 2023–24లో 48,968.8 హెక్టార్లలో సాగు విస్తీర్ణంలో ఉంది. ప్రధానంగా టి.నర్సాపురం మండలంలో 16190 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 16,078 ఎకరాలు, ద్వారకాతిరుమల మండలంలో 17,504 ఎకరాలు, చింతలపూడి మండలంలో 18,304 ఎకరాలు, జంగారెడ్డిగూడెం మండలంలో 8,422 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. హెక్టారుకు నాలుగేళ్లు కలిపి రూ.71 వేలు సబ్సిడీ రూపంలో ఇవ్వడం, 30 ఏళ్ల పాటు దిగుబడి వచ్చే పంట కావడంతో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా ఉత్పత్తి అయ్యే ఆయిల్‌పామ్‌ను పామాయిల్ పరిశ్రమలు తక్కువ గాను, కాస్మొటిక్స్ ఇతర అనుబంధ పరిశ్రమలకు ఎక్కువగా వినియోగిస్తున్నారు.

నేటి నుంచి కొత్త చట్టాల అమలు



రామాంజనేయులు, అడిషనల్ పీపీ

ఏలూరు (టూటౌన్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూలై 1 నుంచి న్యాయ వ్యవస్థలో 13 కొత్త చట్టాలు అమల్లోకి రానున్నట్లు జిల్లా మహిళా కోర్టు అడిషనల్ పీపీ డీవీ రామాంజనేయులు తెలిపారు. బాధితులు ఇకపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే ఎల్రక్టానిక్ కమ్యూనికేషన్ ద్వారా సంఘటనపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అరెస్టు వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌తోపాటు జిల్లా ప్రధాన కేంద్రాల్లోనూ బహిరంగంగా ప్రదర్శిస్తారన్నారు. దీని వల్ల ముఖ్య సమాచారం సులభం తెలుసుకోవచ్చన్నారు. హేయమైన నేరాల్లో వీడియోగ్రఫీ తప్పనిసరి అని దీని వల్ల దర్యాప్తులో నాణ్యత పెరిగే అవకాశం ఉందన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు రెండు నెలల్లోపు పూర్తి కావాల్సి ఉందన్నారు. అలాగే సమన్లను కూడా నేరుగా వెళ్లి ఇవ్వాల్సిన పనిలేదని, ఆన్‌లైన్‌లో పంపించవచ్చన్నారు. బాధితులతో పాటు నిందితులు కూడా ఎఫ్ఐఆర్ కాపీ నకలును ఉచితంగా అందిస్తారన్నారు. సాక్షుల రక్షణ పథకాన్ని దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలని, అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలన్నారు. మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు 15 ఏళ్లలోపు పిల్లలు, 60 ఏళ్లు పైబడిన వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన పనిలేదని, వారు నివసించే చోటే పోలీసు సాయం పొందవచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

పంచారామంలో కేంద్ర మంత్రి పూజలు



పూజలు చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ దంపతులు

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర **ఉక్కు భారీ** పరిశ్రమల శాఖ సహాయ మంత్రి **భూపతిరాజు** శ్రీనివాస వర్మ, వెంకటేశ్వర దేవి (ప్రవీణ) దంపతులు పంచారామ క్షేత్రం భీమవరం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులతో స్వామివారికి పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, నవగ్రహ పూజలు, మృత్యుంజయ హోమం, కుంకుమ పూజలు, లక్ష పత్రిపూజ, మహా లింగార్చన, సూర్య నమస్కారాలు, శాంతి కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధానార్చకులు కందుకూరి సోంబాబు, వేలూరి జమిందార్, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ



కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ సి.నాగరాణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ప్రతి సోమవారం కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఉదయం 10 గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్‌గా ప్రసాద్

దేవరపల్లి: పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్‌గా జీఎల్‌కే ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బోర్డు ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకూ రీజినల్ మేనేజర్‌గా పనిచేసిన ఎం.ఆదిశేషయ్య ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి ప్రసాద్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ప్రసాద్ 2022–23లో కొంత కాలం రాజమహేంద్రవరం ఇన్‌చార్జి రీజినల్ మేనేజర్‌గా పని చేశారు.

ఇన్‌చార్జి ఏపీసీగా డీఈఓ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమగ్రశిక్ష ఏలూరు జిల్లా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ (ఏపీసీ) ఇన్‌చార్జిగా జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహంను నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఏపీసీగా పని చేస్తున్న బి.సోమశేఖరరావు పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీలో ఇన్‌చార్జిగా డీఈఓను నియమించారు. మరో అధికారిని నియమించే వరకూ డీఈఓ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

కోలాట బృందానికి వండర్ బుక్ రికార్డ్



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డును అందిస్తున్న కో–ఆర్డినేటర్ కృష్ణకుమార్

ద్వారకాతిరుమల: జానపద కళకు జీవం పోస్తూ దశావతారాల్లో నృత్య ప్రదర్శనలు జరపడం అభినందనీయమని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఉటుకూరి కృష్ణకుమార్ అన్నారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో శనివారం ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు పర్యవేక్షణలో నెల్లూరు, కడప జిల్లాలతో పాటు జంగారెడ్డిగూడెంకు చెందిన 222 మంది కళాకారులు దశావతారాల్లో జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. పొద్దుటూరుకు చెందిన సావిత్రిబాయి పూలే కోలాట భజన బృందం నిర్వహణలో జరిగిన ఈ ప్రదర్శనలు ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నాయి. ఒకే వేదికపై వందలాది మంది కళాకారులతో ప్రదర్శనలు నిర్వహించిన కోలాట భజన బృందం నిర్వాహకురాలు, సామాజికవేత్త బండి మల్లిక, కోలాటం మాస్టర్ జె.సాయి భరత్, కృష్ణబాబు, పలువురు కళాకారులకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డును ఆదివారం శ్రీహరి కళాతోరణం వేదికపై కృష్ణకుమార్ అందజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించం



పెనుగొండ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

- కలెక్టర్ నాగరాణి
- గురుకుల పాఠశాల, ఆస్పత్రుల తనిఖీ

పెనుగొండ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సి.నాగరాణి హెచ్చరించారు. ఆదివారం ఆచంటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నించారు. వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సోమవారం నుంచి ఆగస్టు 31 వరకు జరిగే డయేరియా నియంత్రణ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హెడ్ నర్స్ జి.రుక్మిణి, ఫర్మసిస్ట్ రామకృష్ణ ఉన్నారు.

'గురుకుల' విద్యార్థినులతో ముఖాముఖి

పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. వసతి, భోజన సదుపాయాలు, బోధన వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి విషయంపై పూర్తి పరిజ్ఞానంతోనే చదువులో రాణించవచ్చన్నారు. పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు పి.జయశ్రీ, వందన, ధర్మానీలు ఉన్నారు.

పాలకొల్లు ఏరియా ఆస్పత్రి తనిఖీ

పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ నాగరాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ, ప్రసూతి వార్డులను పరిశీలించి రోగులను వైద్య సేవలపై ఆరా తీశారు. సేవలందించడంలో నిర్లక్ష్య ధోరణి తగదని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో డయేరియా నియంత్రణ ప్రచారాన్ని విస్తృతం చేయాలన్నారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓ.రవికుమార్, డాక్టర్ రిచర్డ్స్ బూన్, హెడ్ నర్స్ కె.ఫాతిమా ఉన్నారు.

వేకువజామునే పింఛన్లు అందేనా?

- వలంటీర్లకు మొండిచేయి
- సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీకి చర్యలు
- అయోమయంలో లబ్ధిదారులు
- జిల్లాలో 2.35 లక్షల మందికి రూ.155.71 కోట్ల అందజేత

ఆకివీడు : ఒకటో తారీఖున వేకువజామునే ఇంటి వద్దే పింఛన్లు అందుకునే వృద్ధులు, ఇతర లబ్ధిదారులు ఈనెల టెన్షన్‌గా ఎదురుచూస్తున్నారు. కోడి కూసేనా.. ఫించన్లు అందేనా అంటూ ఆతృతతో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లతో ఇంటికే పింఛన్లు అందించారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున విధులు నిర్వహిస్తూ ఠంచన్‌గా పింఛన్ అందించేవారు. నిద్రమత్తులో ఉన్న లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్ సొమ్ములు చేతిలో పెట్టేవారు. అనారోగ్య, ఇతర కారణాలతో స్థానికంగా ఉండని వారికి కూడా వారి వద్దకే వెళ్లి అందించేవారు. ఇలా ఒకటో తారీఖు వస్తుందంటే పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం చేసుకునేవారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీ విధులకు వలంటీర్లను దూరం పెట్టింది.

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బందిని సిద్ధం చేసింది. వీరితో పాటు ఇతర శాఖల ఉద్యోగులను భాగస్వామ్యం చేసింది. ఇలా ప్రతి ఉద్యోగి 50 మందికి పింఛన్లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, పంచాయతీల సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, విద్యుత్, ఇరిగేషన్, సబ్ రిజిస్ట్రార్ శాఖల సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేయించనున్నారు. పింఛన్ల పంపిణీ బాధ్యతలు అప్పగించడంపై వీరంతా తలలు పట్టుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించడంపై ఉద్యోగులు వ్యతిరేక ధోరణిలో ఉన్నట్టు కన్పిస్తోంది. వచ్చేనెల అయినా తమకు ఈ బాధ్యత నుంచి విముక్తి లభిస్తుందా అని గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికే పింఛన్ కార్డుల తనిఖీ ప్రక్రియను సచివాలయ సిబ్బంది పూర్తి చేశారు. పింఛన్ దారుడు ఉన్నాడా, లేదా, అర్హత ఉందా లేదా అనేదానిపై పరిశీలన కూడా పూర్తయ్యింది.



సచివాలయంలో విధుల్లో సిబ్బంది



ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

2.32 లక్షల మంది.. రూ.155.71 కోట్లు

జిల్లాలో 2,32,885 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జూలై నెలలో రూ.155.71 కోట్లు పంపిణీ చేయనున్నారు. గత మూడు నెలల పెంచిన మొత్తం రూ.3 వేలు, ఈ నెల అందించే రూ.4 వేలతో మొత్తంగా రూ.7 వేల చొప్పున లబ్ధిదారులు ఇవ్వనున్నారు.

వలంటీర్ల వ్యవస్థకు మంగళమేనా..!

తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వలంటీర్ల వ్యవస్థను కొనసాగించడంతో పాటు జీతం రూ.10 చేస్తామని ఎన్నికల ముందు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల పంపిణీకి తమను దూరం చేయడంపై వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. తమ ఉద్యోగం ఉందో.. ఊడుతుందో అనే సందిగ్ధంలో ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో రద్దీ



గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తులు

దీవించమ్మా.. గుబ్బల మంగమ్మ

బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామం కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి పొంగలి సమర్పించి ధూపదీప నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచి భారీ వర్షం కురవడంతో వర్షం తగ్గిన తర్వాత భక్తులను ఆలయ కమిటీ సభ్యులు ప్రాంగణంలోకి అనుమతించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, వ్యాన్‌లలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం సమయంలో కూడా వాన పడటంతో కొండ కాలువలు పొంగే అవకాశం ఉన్నందున ఆలయ కమిటీ సభ్యులు భక్తులను త్వరితగతిన బయటకు పంపే ఏర్పాట్లు చేశారు.

– బుట్టాయగూడెం

తమ్మిలేరుకు వరద పోటు



వరద నీటిలో ప్రజల రాకపోకలు

చాట్రాయి: మండలంలోని తమ్మిలేరు వాగులో స్వల్పంగా వరద నీరు చేరుతుంది. రెండు రోజులుగా ఎగువ భాగంలో వర్షాలు కురుస్తుండటంతో ఆదివారం ఉదయం నుంచి తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకి వరద నీరు వస్తోంది. దీంతో మండలంలో కోటపాడు–చింతలపూడి మండలం పోతునూరు, చీపురుగూడెం–అగ్రహారం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం రాత్రి మండలంలో భారీ వర్షం కురిసింది.

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత కృష్ణ చైతన్య దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ. 1,00,000 లను విరాళంగా అందజేశారు. కొవ్వూరుకు చెందిన కె.కృష్ణ చైతన్య ముందుగా సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. దాత దంపతులకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

దేవులపల్లిలో చోరీ



దేవులపల్లిలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

జంగారెడ్డిగూడెం రూరల్: దేవులపల్లిలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. లక్కవరం స్టేషన్ ఏఎస్సై భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ సర్పంచ్ దోరేపల్లి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. ఆదివారం ఇంటి ప్రధాన ద్వారం తలుపులు పగులగొట్టి ఉండటాన్ని లక్ష్మీనారాయణ వద్ద పనిచేస్తున్న నాగేశ్వరరావు చూసి పోలీసులకు, యజమాని అయిన లక్ష్మీనారాయణకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై భాస్కరరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బీరువా పగులకొట్టి అందులో ఉండాల్సిన ఎనిమిది కాసుల బంగారం, కొన్ని వెండి వస్తువులు, కొంత నగదు చోరీకి గురైందని గుర్తించారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించారు. దోరేపల్లి రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు ఢీకొని మృతి చెందిన వ్యక్తి

తాడేపల్లిగూడెం: చేబ్రోలు–పూళ్ల రైల్వేస్టేషన్ల మధ్య శనివారం అర్ధ రాత్రి రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తాడేపల్లిగూడెం రైల్వే పోలీసులు చెప్పారు. మృతుడి వయస్సు సుమారు 45–50 సంవత్సరాల మధ్య ఉంటుందని, నలుపు రంగుపై నీలం రంగు, తెలుపు రంగుతో చిన్న గడులు కలిగిన లుంగీ, తెలుపు రంగు తువ్వాలు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో మార్చురీలో ఉంచినట్టు చెప్పారు. ఘటనపై హెడ్‌కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 17090 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

నారు.. అమ్మకాల జోరు

- కూరగాయలు, పూల నారు విక్రయాలతో వల్లూరు, ముగ్గుళ్ల రైతుల జీవనోపాధి
- వారపు సంతలలో ఎక్కువగా.. మిగిలిన రోజుల్లో ఊరూరా తిరిగి విక్రయాలు
- కరోనా తరువాత పుంజుకుంటున్న వ్యాపారం.. 100 మంది రైతులకు ఉపాధి



కూరగాయల నారు మొక్కలు అమ్ముతున్న వ్యాపారి



కూరగాయలు, పూల నారు సాగు చేస్తున్న రైతు

గణపవరం: ఏటా తొలకరి వచ్చిందంటే నారు వ్యాపారం జోరుగా సాగుతుంది. జూన్ నుంచి సుమారు నాలుగు నెలల పాటు ఈ వ్యాపారం ఉంటుంది. వివిధ రకాల కూరగాయల మొక్కలు, పూలమొక్కలు, విత్తనాలను వారపు సంతలలో అమ్మకాలు చేస్తూ గణపవరం మండలం వల్లూరు, ముగ్గుళ్ల గ్రామాలకు చెందిన సుమారు 100 మంది జీవనోపాధి పొందుతున్నారు. ఈ గ్రామాలకు చెందిన కొందరు రైతులు దశాబ్దాలుగా కూరగాయలు, పూల మొక్కల నారు సాగు చేస్తూ, వాటిని జిల్లాలోని వివిధ గ్రామాలలో నిర్వహించే వారపు సంతలలో విక్రయిస్తుంటారు. సంతలు లేని రోజులలో సైకిళ్లపై గ్రామాలలో తిరుగుతూ నారు మొక్కలను అమ్ముతుంటారు. వేసవి తర్వాత జూన్‌లో వర్షాలు పడటం ఆరంభమవగానే ప్రజలు నారు మొక్కలు, విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. వంగ, టమాటా, పచ్చిమిర్చితో పాటు బంతి, చామంతి, కనకాంబరం, గులాబి వంటి పూలమొక్కల నారు వారపు సంతలలో దుకాణాలు వేసి అమ్ముతుంటారు. వీటితో పాటు తోటకూర, గోంగూర, కొత్తిమీర, పాలకూర, చిక్కుడు, బీర, బెండ, వంగ, మిర్చి, పొట్ల, ఆనబ, గుమ్మడి, కాకర వంటి పలు రకాల కూరగాయల విత్తనాలు అమ్ముతుంటారు. ఒక్కో వ్యాపారి గ్రామాలలో తిరిగి రోజుకు రూ.రెండు నుంచి మూడు వేల విలువైన నారు విక్రయిస్తుండగా, అదే వారపు సంతలలో అయితే రూ.నాలుగైదు వేల వరకు అమ్మకాలు చేస్తారు.

కరోనాతో కష్టాలు

కరోనా అన్ని వర్గాలను కుదేలు చేసినట్లే నారు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపింది. అప్పట్లో తయారై, అమ్మకానికి సిద్ధంగా ఉన్న నారు మొక్కలు ముదిరిపోయి వ్యాపారులకు రూ.లక్షల్లో నష్టాలు వచ్చేవి. విత్తనాలు కూడా అమ్ముడుపోక నిరుపయోగంగా మిగిలేవి. దీంతో వ్యాపారులు జీవనోపాధి కోల్పోయారు. కరోనా తర్వాత కొంత కాలం అరకొరగా వ్యాపారం సాగినా పెద్దగా గిట్టుబాటు కాలేదు. గత రెండేళ్లుగా నారు వ్యాపారం కాస్త పుంజుకుంది.

వల్లూరు నారుకు డిమాండ్

వల్లూరు, ముగ్గుళ్ల గ్రామాలలో సాగుచేసే నారుకు జిల్లా వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ఈ గ్రామాలకు చెందిన పలువురు రైతులు నాలుగైదు దశాబ్దాల కాలంగా తమ పొలాల వద్ద, పుంతగట్లు, ఖాళీ దిబ్బలు, గ్రామ పంచాయతీ చెర్వు గట్లపై వివిధ రకాల నారు సాగు చేస్తుంటారు. 20 సెంట్ల నారుమడి తయారీ, విత్తనాలు, సస్యరక్షణకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ మడిలో వివిధ రకాల కూరగాయలు, పూల మొక్కల నారు సాగు చేస్తుంటారు. మే చివరి వారంలో నారు మడులు వేసి జూలై నుంచి నారు అమ్మకాలు ప్రారంభిస్తారు. ఇక్కడి వంగ, మిరప, టమాటా నారు మొక్కలు మంచి దిగుబడి ఇస్తాయని నమ్మకం. కొద్ది రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో వ్యాపారులు నారు అమ్మకాలను ప్రారంభించారు.



అమ్మకానికి సిద్ధం చేసిన పూలు కూరగాయల నారు

కోతుల బెడదతో ప్రజల్లో తగ్గిన ఆసక్తి

గతంలో కూరగాయలు, పూల మొక్కల పెంపకంపై ప్రజలు ఆసక్తి చూపేవారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్ద కూరగాయల నారు, విత్తనాలు కొనుగోలు చేసి పెరటి పంటగా పండించే వారు. రైతులు కూడా పొలం గట్లపై కూరగాయల మొక్కలు పెంచే వారు. అయితే కొన్నేళ్లుగా కోతుల బెడద ఎక్కువైంది. ప్రస్తుతం ఏగ్రామంలో చూసినా కోతులు గుంపులుగా తిరుగుతూ పెరటి మొక్కలను పీకి పందిరేస్తున్నాయి. ఎంతో మక్కువగా పెంచిన మొక్కలకు కాసిన కూరగాయలను దక్కకుండా చేస్తున్నాయి. దీనితో ప్రజలకు కూరగాయల మొక్కలు పెంచాలన్న ఆసక్తి సన్నగిల్లిపోయింది. ఈ ప్రభావం పరోక్షంగా నారు అమ్మకాలపై పడింది.

గతంలో ఉన్న ఆదరణ లేదు



రెండు దశాబ్దాలుగా వారపు సంతలలో నారు, విత్తనాల వ్యాపారం చేస్తున్నాను. గతంలో ఉన్నంత ఆదరణ ఇప్పుడు లేదు. కరోనా కారణంగా చాలా నష్టపోయాం. అప్పట్లో నారు పెంపకం, సస్యరక్షణకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కేదికాదు. దీనికి తోడు గ్రామాల్లో కోతుల బెడద వల్ల ప్రజలు కూరగాయల మొక్కల కొనుగోలును తగ్గించి వేశారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు సబ్సిడీపై రుణాలిచ్చి ఆదుకోవాలి.

– మంగెన రాంబాబు, నారు వ్యాపారి

అంతంతమాత్రంగా అమ్మకాలు



గతంలో సీజన్‌లో రోజుకు రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేల విలువైన నారు మొక్కలు, విత్తనాలు అమ్మేవాళ్లం. ఇప్పుడు రోజుకు రూ.నాలుగైదు వందలు అమ్మడమే గగనంగా ఉంది. గతంలో మహిళలు పూలమొక్కలు, రైతులు విత్తనాలు తీసుకువెళ్లి పొలంగట్లు, దిబ్బలపై వేసేవారు. కోతుల పుణ్యమా అని పొలాల్లో కూరగాయల మొక్కలు పెంచడం రైతులు ఎప్పుడో మానేశారు. దీంతో వ్యాపారం అంతంతమాత్రంగానే ఉంది.

– బేతు శ్రీనివాసరావు, నారు వ్యాపారి

ఆదివాసీ గిరిజనుల సంస్కృతిని పరిరక్షించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



మెరకగూడెంలో ఆదమ రాజు గద్దె వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన మెరకగూడెంలో సోదెం వారి ఇలవేల్పుల ఆడమరాజు గద్దెను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులు సంస్కృతి సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. వాటిని కాపాడుకుంటూ భావితరాలవారిని వాటిని తెలిసే విధంగా కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి సోదెం సుధాకర్, సర్పంచ్ సోదెం గంగాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొడ్డాడి నాగేశ్వరరావు, శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సాల్ట్' శిక్షణ వాయిదా వేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులకు పది రోజుల పాటు నిర్వహించనున్న సాల్ట్ శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభోత్సవంలో ఓ వైపు ప్రవేశాలు, మరో వైపు విద్యాప్రవేశం, నేను బడికిపోతా కార్యక్రమాలతో పాటుగా బోధన కార్యక్రమాలు చేపడుతున్న ఈ సమయంలో శిక్షణ కార్యక్రమాల పేరుతో పది రోజులపాటు ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరంగా ఉంచడం సరికాదన్నారు. ఈ ప్రభావం విద్యార్థులపై పడుతుందని, ఈ మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టీ రామారావు, బీ రెడ్డి దొర కోరారు.

భారంగా చేపనారు ఉత్పత్తి



తల్లి చేపకు ఇంజక్షన్ చేస్తున్న దృశ్యం (ఫైల్)



బాదంపూడి మత్స్య కేంద్రం కార్యాలయం

లక్ష్యానికి దూరంగా బాదంపూడి మత్స్య కేంద్రం

ఉంగుటూరు: బాదంపూడి మత్స్య కేంద్రంలో చేప పిల్లల (చేప నారు) ఉత్పత్తిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా పేరొందినా ప్రస్తుతం లక్ష్యఛేదనలో వెనుకబడింది. ఇక్కడ వృద్ధి చేసిన చేప పిల్లలను ఉమ్మడి రాష్ట్రాల్లో ప్రభుత్వ ఫారాలను ఉచితంగా సరఫరా చేసేవారు. గతంలో చేప నారును విక్రయించగా వచ్చే మొత్తంతో ఈ మత్స్య కేంద్రాన్ని స్వయంగా నిర్వహించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండేది. గతంలో కేవలం రెండు కోట్ల ఉత్పత్తి లక్ష్యం నుంచి పది కోట్లకు, ఆ తరువాత 20 కోట్ల చేపనారు ఉత్పత్తిని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ నారును ప్రైవేట్ రైతులకు లేదా ప్రైవేట్ ఫారాలకు విక్రయించేందుకు అనుమతులు లేవు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇక్కడ వృద్ధి చేసిన చేప పిల్లలను ప్రభుత్వ ఫారాలకు మాత్రమే ఉచితంగా సరఫరా చేయాలని నిబంధన తీసుకురావడంతో చేప నారు పూర్తిస్థాయిలో ఖర్చయ్యేది కాదు. దీంతో తయారుచేసినా చేపనారు బయటకు వెళ్లే మార్గం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రంలో చేప పిల్లలను, తల్లి చేపలను పెంపకం తగ్గిపోయింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం చేప నారు కోసం తల్లి చేపలను సైతం బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

జూలై రెండో వారం నుంచి ఉత్పత్తి

ఈ ఏడాది 20 కోట్ల చేప నారు ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. జూలై రెండో వారం నుంచి చేప నారు ఉత్పత్తి చేయడం ప్రారంభిస్తారు. గోదావరి కాలువ నీరు విడుదల నేపథ్యంలో ఉత్పత్తికి సన్నాహాలు ప్రారంభిస్తున్నారు. దీనిపై మత్స్య కేంద్రం ఇన్‌స్పెక్టర్ రవిని వివరణ కోరగా, తల్లి చేపలను బయటకు కొనుగోలు చేయాల్సి ఉందని, ఫారంలో చేప నారు ఉత్పత్తిని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

పోడూరు: అనారోగ్యం తాళలేక ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. జిన్నూరు శివారు చాకిరేవుగుంట గ్రామానికి చెందిన గారపాటి సౌజన్య (22) కొంతకాలంగా ఫిట్స్ వ్యాధి, మానసిక రుగ్మతలతో బాధపడుతోంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొద్దిసేపటికే ఆమె సోదరుడు రాజు చూసి ఆమెను వెంటనే పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు ఎస్సై డి.రామ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,538 కేసుల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆన్‌లైన్ ద్వారా కూడా కేసులు పరిష్కారం చేసినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదివారం వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బి.కృష్ణమోహన్ ఆదేశానుసారం జూన్ 29న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1,538 పెండింగ్ కేసులను పరిష్కరించామన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 35 బెంచీలు ఏర్పాటు చేశామని, వీటిలో ఏలూరులో 9, భీమవరం 5, కొవ్వూరు 3, నరసాపురంలో 4, తాడేపల్లిగూడెంలో 5, పాలకొల్లు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, భీమడోలు కోర్టుల్లో ఒక్కొక్కటి చొప్పున బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 1,538 పెండింగ్ కేసులను పరిష్కరించగా, వీటిలో 1,254 క్రిమినల్ కేసులు, 129 మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, 153 సివిల్ కేసులు రాజీ చేయగా 102 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. వీటిలో ఏలూరులో 568, భీమవరంలో 172, చింతలపూడిలో 55, జంగారెడ్డిగూడెంలో 61, కొవ్వూరులో 120, నరసాపురంలో 105, పాలకొల్లులో 70, తాడేపల్లిగూడెంలో 184, తణుకులో 129, నిడదవోలు, భీమడోలు కోర్టుల్లో 37 కేసుల చొప్పున ఉన్నాయన్నారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా 2,356 పెట్టీ కేసులను కూడా రాజీ చేశామన్నారు. అంతేకాక ఆన్‌లైన్ ద్వారా 10 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. వాహన ప్రమాద బీమా కేసుల్లో రూ.8 కోట్లకు పైగా పరిహారాన్ని బాధితులకు చెల్లించడం జరిగిందన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పాటు నందించిన న్యాయవాదులు, పోలీస్, రెవెన్యూ, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులకు, చిట్‌ఫండ్ ప్రతినిధులకు, కార్మిక శాఖ, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్, జిల్లా పంచాయతీ అధికారులు, సిబ్బందికి, కోర్టు సిబ్బందికి, మీడియాకు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శివైక్యం

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిధాం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానందపురి స్వామిజీ (79) శనివారం రాత్రి శివైక్యం చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. 18 సంవత్సరాలుగా వాసవీ శాంతిధాంలో పీఠాధిపతిగా భక్తులకు సేవలు అందించారు. వాసవీ శాంతి థాంలో నిర్వహించే పూజా కార్యక్రమాలు, ఉత్సవాలను పర్యవేక్షిస్తూ నిర్వాహకులు, భక్తుల మన్ననలు పొందారు. ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, భక్తిచింతన మార్గంతో పాటు, వాసవీ పురాణం, వాసవీ మాత చరిత్రపైనా ప్రత్యేక అవగాహనతో పూర్తిస్థాయిలో భక్తులకు ప్రవచించేవారు. పీఠాధిపతి మరణవార్తతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు, ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు తరలి వచ్చి, వాసవీ శాంతిధాంలోనే నిర్వహించిన భూసమాధి కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఠాధిపతి కృష్ణానందపురిస్వామిజీ శివైక్యం సమాచారంతో ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులు బెంగుళూరు నుంచి తరలివచ్చి కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో లోకల్ కమిటీ చైర్మన్ కోట్ల వెంకటేశ్వరరావు, బొండాడ రాంపండు, కేఆర్ కృష్ణ, ఎస్.సతీష్, కోట్ల సూర్యారావు, తెనాలి పీఠాధిపతి బాల స్వామి, ఇతర పీఠాధిపతులు వాసుదేవానంద గిరిస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.



కృష్ణానందపురి స్వామిజీ (ఫైల్)



వాసవీ శాంతిధాంలో భూసమాధి చేస్తున్న దృశ్యం

ప్రకృతి సాగుతో భూసారం మెరుగు

- వంటకు పుష్కలంగా సూక్ష్మ, స్థూల పోషకాలు
- ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో పెరిగిన ఆసక్తి



వీరవాసరంలో కూరగాయ పాదుకు ఏర్పాటు చేసిన ఆకర్షణ బుట్ట

వీరవాసరం: రసాయన ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల భూమి సారం కోల్పోతుంది. రసాయన ఎరువులు మితిమీరి ఉపయోగించి పండించిన ఆహారాన్ని తినడం వల్ల ప్రజలు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. అయితే రానురాను సేంద్రియ ఉత్పత్తుల వినియోగంపై ప్రజలు మొగ్గుచూపుతుండటంతో రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యంతో పాటు భూసారం పెంచుకునేందుకు ప్రకృతి వ్యవసాయమే మార్గమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రేపటి తరానికి సారవంతమైన భూములు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తూ రైతులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లాలో పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయం చేయడానికి రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు దాళ్వా సాగు పూర్తయిన ఖాళీ చేలల్లో నవధాన్యాలతో కూడిన పంటలను వేశారు. మొక్కజొన్న, మినుములు, పెసలు, ఉలవలు, జొన్న, రాగి, జీలుగా, జనుము, గోంగూర, తోటకూర, కొత్తిమీర, బీర, ఉలవలు, కొర్రలు, ఆనబ తదితర విత్తనాలను నవధాన్యాలుగా పంట పొలాల్లో వేశారు. వీరవాసరం మండలం కొణితివాడ, గవరపాలెం, నరసన్న చెరువు గ్రామాల్లో పెద్ద ఎత్తున నవధాన్యాలు పంటలను వేశారు. పంట వేసి 40 నుంచి 45 రోజులు కావడంతో ఏపుగా ఎదిగి పంటలను పశువులకు మేత కోసం సిద్ధంగా ఉన్నాయి. నవధాన్యాల పంటలను కోసి వినియోగించగా మిగిలినది భూమిలో ట్రాక్టర్‌తో కలియ దున్నడంవల్ల భూమి గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.



ఏపుగా ఎదిగిన నవధాన్యాల పంట



చేలల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు

బీజామృతం కీలకం

ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం కీలక పాత్ర పోషిస్తోంది. దేశీ ఆవు పేడను పల్చటి గుడ్డలో మూట కట్టి 20 లీటర్ల నీరు ఉన్న తొట్టిలో 12 గంటలు ఉంచాలి. ఒక లీటర్ నీటిని వేరే పాత్రలో తీసుకుని 50 గ్రాముల సున్నం కలిపి రాత్రంతా ఉంచి ఉదయాన్నే నానబెట్టిన పేడ మూటను చేతితో పిండి రసాన్ని నీటి తొట్టిలో కలపాలి. అలా వచ్చిన ద్రావణాన్ని 12 గంటల పాటు నిల్వ ఉంచి, మరునాడు విత్తనాలు పట్టించి నీడలో ఆర బెట్టి నాటితే ఏ రకమైన చీడపీడలు రాకుండా విత్తనాలు మొలకెత్తుతాయి. దాళ్వా, సార్వా సీజన్‌లో ఏ సమయంలో అయినా వరి విత్తనాలకు జీవామృతాన్ని కలిపి వాడుకుంటే చీడపీడల ఉధృతి తగ్గుతుంది. వీటితో పాటుగా గుడ్ల ద్రావణం, పొగాకు, వేపాకు ద్రావణాలను వాడుకోవడం మంచిది.

పచ్చిరొట్ట సాగుతో లాభాలు

సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో నవరత్నధాన్యాల పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా జీవవైవిధ్యం పెరుగుతుంది. 365 రోజులు బహుళ పంటలతో సాగు సాధ్యమవుతుంది. ప్రధాన పంటకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాలు లభిస్తాయి. నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. బహుళ పంటల వల్ల చేలల్లో కలుపు ఉండదు. నేల కోతకు గురికాదు. ప్రధాన పంట చీడపీడలు, తెగుళ్లు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. నేల గుల్లబారి వానపాములు, నీటి నిలువ సామర్థ్యం పెరుగుతాయి. ప్రధాన పంటల్లో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గుతుంది. బహుళ పంటల వల్ల అదనపు ఆదాయం లభించడంతో పాటు దిగుబడులు పెరుగుతాయి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభలు ఏర్పాటు చేసి ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నవధాన్య విత్తన పంటల ద్వారా పొలాల్లో పచ్చిరొట్ట పశువులకు దాణాగానూ, చేలు సారవంతం అవ్వడానికి ఉపయోగపడతాయి. నవధాన్యాల పచ్చిరొట్ట వేయడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుంది. ఎరువులు వాడకం తగ్గుతుంది. వరి, కూరగాయలు సాగులో చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

– బొశెట్టి శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ, కొణితివాడ

క్లుప్తంగా

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏవీఐ ఎస్ ఆసుపత్రి సహకారంతో వెరికోస్ వెయిన్స్, దీర్ఘకాలిక మోకాలు, మరియు కీళ్ళ నొప్పులకు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రజని కన్స ల్టెంట్ వారి పర్యవేక్షణలో 150మంది రోగుల కు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అనంత రం వెరికోస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెం కటేశ్వరరావు, పూర్వాధ్యక్షుడు వబిలిశెట్టి నట రాజ్, మానేపల్లి రామారావు, అధ్యక్షుడు కొల్లే పర రాము, కార్యదర్శి నున్న బాల త్రిపుర సుం దరరావు, కోశాధికారి భోగవల్లి రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి



వాకర్స్ నెలవారీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్యవంతమైన సమాజంకోసం కృషిచేద్దామని పలువురు వాక ర్స్ పేర్కొన్నారు. వాకర్స్ నెల వారీ సమావేశం ఆదివారం అధ్యక్షులు దూలం నాగరాజు అధ్య క్షతన నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవితానికి నడక ఎంతో అవ సరమని, యోగా తప్పనిసరిగా చేయాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. సమావేశంలో యోగా గురువు బడుగు చంద్రశేఖర్, కార్యదర్శి చిప్పాడ గురుమూర్తి, కోశాధికారి మల్లారెడ్డి సారధి, కేవీ చలం, రాగిరెడ్డి ప్రసాద్, వనచర్ల నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



ఎల్.అగ్రహారం గ్రామంలో నిరుపేదలకు నిత్యావసరాలను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్. అగ్రహారం గ్రామంలోని వల్లీ మోహన్ యువ జన సేవా సమితి కార్యాలయంలో పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సంద ర్భంగా సేవాసమితి అధ్యక్షుడు పటాన్ వలీ మాట్లాడుతూ ఆదరణ కొరవడిన వృద్ధులు, అనాథలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమ సంస్థ సేవా కార్యక్రమా లను క్షేత్ర స్థాయి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. సేవా సమితి గౌరవాధ్యక్షులు ఉండ్రాజవరపు భాస్కరరావు, కార్యదర్శి గొల్లేరు మోహన్, జి.స మర్పణరావు, బచ్చు దినేష్, మెంటే రాంబాబు, పటాన్ సుబాని, పోలిశెట్టి రంగా రావు, నేదూరి సత్యనారాయణ, యువీ.సునీత పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో 56.4 మి.మీ. వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్ల 56.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 53 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందన్నారు.

ఎల్‌టీపీల సంక్షేమానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ పి.మురళీ కృష్ణ

తణుకు టౌన్: లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ ఎల్‌టీపీ అసోసియే షన్ చైర్మన్ పీ మురళీ కృష్ణ కోరారు. ఆదివారం తణుకు చిట్టూరి హెరిటేజ్‌లో నిర్వహించిన పశ్చిమ గోదావరి జిల్లా అర్బన్ లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావే శానికి జిల్లా అధ్యక్షుడు వెలగన శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ఎల్‌టీపీల సంక్షేమానికి ప్రమాద బీమాను కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 125 మున్సిపాలిటీల పరి ధిలో 4 వేల మంది ఎల్‌టీపీలు ఉన్నారన్నారు. ఎల్ టీపీల సమస్యలను మున్సిపల్ శాఖామంత్రి, సీఎం ల దృష్టికి తీసుకెళ్లి ఎల్‌టీపీల కోసం ప్రత్యేక భవన నిర్మాణానికి స్థలం కేటాయించేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వం అత్యధిక సమ స్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ప్రఖ్యాత ఇంజ నీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ దుర్గారావు, జిల్లా కార్యదర్శి జేపీ నాయుడు, కె.రఘునందరావు, సీతాపతిరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పెంటపాడు సంగం మేడలో ఉచిత వైద్యశిబిరం ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు: ప్రస్తుత వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రభుత్వ వైద్య సిబ్బందితో పాటు, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు అప్రమత్తంగా ఉం డాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పెంటపాడు సంగం మేడ వద్ద వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అర్జున్ ఆసు పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భం గా అర్జున్ ఆసుపత్రి యాజమాన్యాన్ని, డాక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో దాసరి అప్పన్న, దాసరి కృష్ణవేణి, కిలపర్తి వెంకట రావు, పుల్లాబాబీ, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, బండారు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి చిత్రపటం అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పిఠాపురం శ్రీ వేణుగో పాల స్వామి దేవాలయం అర్చకులు, శ్రీరామ హిం దూ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు విజయ జనార్ద నాచార్య దంపతులు ఆదివారం తాడేపల్లిగూడెం శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బొలిశెట్టి శ్రీనివాస్‌కు అభి నందనలు చెప్పి, వేణుగోపాల స్వామి ఆలయాన్ని దర్శించాలని కోరుతూ శేష వస్త్రం, పుష్పమాల, స్వామి వారి చిత్రపటాలను అందజేశారు.

ఘనంగా మానవత సభ్యుల ప్రమాణ స్వీకారం



మానవత సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర నలుమూల ప్రాం తాలలో అనేక సేవలందిస్తున్న ఏకైక సంస్థ మాన వత స్వచ్ఛంద సేవాసంస్థ అని సంస్థ జిల్లా అధ్యక్షు లు తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్లో మానవత సంస్థ 2024–25 సంవత్సరానికి గానూ పట్టణ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం పత్స వెంకటేశ్వరరావు, ఇతర సభ్యులతో ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. జానకిరామ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ మానవత సభ్యులు 65 వేల మంది ఉన్నారని, వారు సైనికుల మాదిరి అనేక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో ఈతకోట తాతాజీ, ముప్పిడి సురేష్ రెడ్డి, రామలక్ష్మి, బలుసు సత్యనారాయణ, బత్తుల ప్రసాద్, మాకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠిక.. ప్రజా పాలనకు దీపం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త వర్మ

తణుకు: రాజ్యాంగంపై మతతత్వవాదుల దాడు లను తిప్పి కొట్టడంతో పాటు భారత రాజ్యాం గాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని ప్రముఖ సామాజిక వేత్త, దారి దీపం సంపాదకుడు డీవీవీఎస్ వర్మ పేర్కొ న్నారు. తణుకు సురాజ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన దారి దీపం మాసపత్రిక మిత్రుల సమాలోచన సభలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వ హించిన ఈ సభలో రాజ్యాంగ పీఠిక–ప్రజా పాలనకు దారి దీపం అనే అంశంపై వక్తలు మాట్లాడారు. ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణులు ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ రచించిన రాజ్యాం గ పీఠిక గ్రంథాన్ని రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకురాలు సంకు మనోరమ ఆవిష్క రించారు. అనంతరం బహుళ సంస్కృతిపై హిం దుత్వ దాడి–ప్రత్యామ్నాయాలు అనే అంశంపై నిర్వహించిన రెండో సదస్సులో ప్రముఖ జర్న లిస్టు మండలపర్తి కిశోర్, కె.శాంతారావు, డాక్టర్ సి.స్టాలిన్, మాజీ న్యాయమూర్తి లక్ష్మి, సామాజిక ఉద్యమకారులు హైమావతి, వావిలాల సర శాదేవి మాట్లాడారు. సమావేశంలో ప్రముఖ పాత్రికేయులు డి.సోమ సుందర్, డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు, సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళీ కుమార్ పాల్గొన్నారు.

రావిపాడులో అన్నసమారాధన

పెంటపాడు: రావిపాడు గ్రామంలోని శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరుని కల్యాణ ఉత్సవాలు ముగిం పు పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో సుమారు 5 వేల మందికి అన్నసమా రాధన నిర్వహించారు. కార్యక్రమంలో చింతపల్లి, దువ్వ, అలంపురం, కొండేపాడు, గ్రామాలకు చెం దిన భక్తులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్‌లో బీజేపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న మన్‌కీబాత్ 111వ కార్యక్రమాన్ని స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రంలో ఆదివారం అధ్యక్షులు నరిశే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. బీజేపీ సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావించారని నాయకులు వెల్లడిం చారు. కార్యక్రమంలో శక్తి కేంద్ర సభ్యులు తుమరాడ చిన్న, ముత్తం చిన్ని తది తరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సూరంపూడి వెంకట రమణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మండల రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం 145వ నెలవారి సభా కార్యక్రమం ఆదివారం రాత్రి ఆర్టీసీ డిపో సమీపంలోని వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండ పంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షులు సూరం పూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకా యల వంశీ కృష్ణ, కోశాధికారి తగరంపూడి ముర ళీకృష్ణలు పర్యవేక్షించారు. పెదవెల్లమిల్లికి చెందిన వాస్తు పండితులు దండమూడి సత్యనారాయణకు గౌరవ సత్కారం, భీమవరానికి చెందిన సాయి ఘంటసాల ఆర్కెస్ట్రా నిర్వాహకులు తమిరి సాం బమూర్తికి కళా సత్కారం, కొమ్ముగూడెం వ్యాయమ ఉపాధ్యాయులు కొత్త సుభద్రకు ఉద్యోగ సేవా పురస్కారం, కిడ్నీ వ్యాధితో బాధప డుతున్న సీనియర్ భజన కళాకారుడు ఇసరపు అబ్బులకు ఆర్థిక సత్కారం చేశారు. కళాకారుల ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి నిర్వ హించారు.

ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక కమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పరిమి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బసవా రామకృష్ణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చుక్కా సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంచార వైద్యశాలను సద్వినియోగం చేసుకోండి

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సం యుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్య సేవలను వినియోగించుకో వాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్య శాల ద్వారా తణుకు పట్టణం, సజ్జాపురం, దువ్వ, పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి వైద్య సూచనలు, సలహాలు అందించారు. ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ కేవీ.రావు ఆర్థిక సహా యంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణా నందం, తదితరులు పాల్గొన్నారు.

4న అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సభ



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

భీమవరం (ప్రకాశంచౌక్): మన్యం విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారా మరాజు 127వ జయంతి సందర్భంగా శత వర్ధం తిని పురస్కరించుకొని జిల్లా కేంద్రం భీమవరం లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేం ద్రం ట్రస్టు చైర్మన్ బి.బలరాం తెలిపారు. ఆది వారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం లో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వ హణ కమిటీ సమావేశం ట్రస్టు కార్యదర్శి జేఎస్‌వీ గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంద ర్భంగా ట్రస్ట్ చైర్మన్ బి.బలరాం మాట్లాడుతూ భీమవరంలో అల్లూ రి సీతారామరాజు శత వర్ధంతి నిర్వా హణ కమిటీ ఆధ్వ ర్యంలో పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నలుమూలల నుంచి అల్లూరి స్వ గ్రామం మోగల్లు, తాడేపల్లి గూడెం, ఆకివీడు, నరసాపురం ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తు న్నామన్నారు. ప్రజలందరూ భీమవరంలో జరిగే ర్యాలీలు, సభల్లో పాల్గొనాలని బలరాం కోరారు. నిర్వహణ కమిటీ సభ్యులు కె.రాజా రామ్మోహన్ రాయ్, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం .ఆంజనేయులు, కె.క్రాంతి బాబు, బి.చైతన్య ప్రసాద్, షేక్ వలీ, బత్తుల విజయ్ కుమార్, ఎన్. రంగ, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢమాస జాతర



జాతరలో సమర్పించిన నైవేద్యం

వీరవాసరం: మండలం లోని రాయకుదురులో వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీ మావుళ్ల మ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ పోతురాజు స్వాము లకు ఆదివారం ఆషాఢ మాస జాతర మహోత్స వాలు ఘనంగా నిర్వ హించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరగలను పూరి గుడిసెలోకి తీసుకొచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మ వార్లకు పుట్టింటివారి నుంచి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండవీటి రామచంద్రరావు, సర్పంచ్ గెడ్డం భారతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, మాజీ సర్పంచ్ కౌరు భాస్కరరావు, తోట విజయ్‌కుమార్, ఎం దుర్గాప్రసాద్, కౌరు రామగోపి, శీలబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.